

కె. బాలగోపాల్

# గిల్‌ను గుజరాత్‌కు ఎందుకు పంపించినట్లు?

**పంజాబులో 'జిందాషహీద్ సంఘటన' అనే సంస్థ ఒకటి ఉందట. ఆ పేరుకు అర్థం 'బతికి ఉన్న అమరుల సంఘం' అని. అదేదో కుర్రకారు జోక్‌గా పెట్టుకున్న పేరు కాదు. కె.పిఎస్‌గిల్ నేతృత్వంలో పంజాబు పోలీసులు ఖలిస్తానీ హింసావాదాన్ని అణచడానికి విచ్చలవిడిగా బలప్రయోగానికి పాల్పడిన రోజులలో కార్యదక్షత గల పోలీసులుగా పేరు పొంది, ప్రశంసలూ పారితోషకాలు కూడా పొంది, ఇప్పుడు ఆనాడు వీరి చేతులలో హింసకు గురయిన కుటుంబాలు కోర్టులో వేసిన కేసులు తాకిడికి విలవిలలాడుతున్న పోలీసు అధికార్లు పెట్టుకున్న సంఘం ఇది.**

గిల్ నేతృత్వంలో పంజాబు పోలీసులు చేసిన అఘాయిత్యాలు అంతా యింతా కావు. కనీసం 25,000 ఒకే వేళ శవాలను గుర్తు తెలియని శవాలుగా పోలీసులు పూడ్చి పెట్టారని 'జన జీవన స్రవంతి'కి చెందిన అకాలీదళ్ పార్టీయే అంచనా వేసింది. ఆ 'గుర్తు తెలయని శవాల గుర్తు తెలుసుకుందామని ప్రయత్నించిన అకాలీదళ్ మానవ హక్కుల సెల్ ఇన్‌ఛార్జి అయిన జస్వంత్‌సింగ్ కల్రా కూడా ఆచూకీ తెలియకుండా మాయం అయ్యాడు. అతనిని 'మాయం' చేసింది అప్పటి తరన్-తరన్ ఎస్‌పి అమర్‌జిత్ సింగ్ సంధు అని చాలామంది నమ్ముతారు. కల్రానే కాక కొన్ని వందల మందిని హతమార్చిన ఈ పోలీస్ అధికారి కెపిఎస్ గీత ప్రియశిష్యుడు.

ఇవన్నీ చేసి ఖలిస్తానీ హింసను సమర్థవంతంగానే అణచిన గొప్ప పోలీస్ ఆఫీసర్‌గా కెపిఎస్ గిల్‌కు పేరు వచ్చింది. ఇంతకంటే ఘోరమైన అణచివేతకు సైన్యం ప్రతిరోజూ పాల్పడుతున్న కాశ్మీర్‌లో కాశ్మీరీ పోరాటం అణగారిపోలేదు కాబట్టి, పంజాబులో ఖలిస్తాన్ పోరాటం చల్లారిపోవడానికి గిల్ ఘనత కారణమా, లేక ఖలిస్తాన్ వాదుల విచక్షణారహితమైన హింసాకాండ పట్ల పంజాబీ సిక్కులు విసిగిపోవడం

కారణమా, లేక సిక్కు ప్రజలలో సహితం ఖలిస్తాన్ డిమాండ్‌కు మెజారిటీ సపోర్టు ఏరోజూ లేకపోవడం కారణమా అన్నది ప్రశ్నార్థకంగానే ఉంటుంది.

అయితే శాంతి నెలకొన్న తరువాత, అన్నాళ్ళూ పోలీసుల చేతిలో హింస చవిచూసిన పంజాబు ప్రజలు ఊరుకోలేదు. పోలీసుల పైన కుప్పలుగా కేసులు వేసారు. వేరే ఏ రాష్ట్రంలోనూ లేనంతగా పంజాబు పోలీసులు క్రిమినల్ కోర్టులలో కేసులు ఎదుర్కొంటున్నారు. 'సమాజానికి మేమింత గొప్ప సేవ చేస్తే ఇదా సమాజం మాకు ఇచ్చే ప్రతిఫలం' అన్న నిరసనతో వారు తమకు తాము 'బతికున్న అమరులు' అని పేరు పెట్టుకున్నారు. వారి బాధల గురించి వారి నాయకుడు కెపిఎస్ గిల్ అప్పుడప్పుడు పత్రికలలో వ్యాసాలు రాస్తుంటాడు. అయితే పంజాబులో ఖలిస్తాన్ పోరాటం పట్ల ఏ మాత్రం సదభిప్రాయం లేనివారికి సహితం ఈ 'బతికున్న అమరుల' పట్ల ఎంత మాత్రం సానుభూతి లేదు. సాగిన రోజులలో వారి ప్రవర్తన అటువంటిది.

ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి. గిల్ బహుశా హిందూ తీవ్రవాదానికీ ముస్లిం తీవ్రవాదానికీ తేడా చూడకపోవచ్చు. రక్తం రుచి మరిగిన పోలీస్ అధికారి కాబట్టి బజరంగ్ దళ్ రక్తం కూడా ఆయనకు రుచిగానే ఉండగలదు. అయితే ఆయన ప్రభుత్వానికి సలహాదారు మాత్రమే.

కెపిఎస్ గిల్‌ను ఇప్పుడు నరేంద్ర మోడి ప్రభుత్వానికి 'భద్రతాసలహాదారుడు'గా కేంద్ర ప్రభుత్వం నియమించిందన్న వార్త చదివిన తరువాత ఈ చరిత్రను పునశ్చరణ చేసుకోవాలని పించింది. భారత రాజ్యాంగంలో 'భద్రతా సలహాదారు' అనే పదవి ఏదీ లేదు. రాష్ట్రపతి పాలన విధించి నట్లయితే, గవర్నర్‌కు ఒక సలహాదారును నియమిస్తారు. అయితే ప్రజలు ఎన్నుకొన్న మోడి ప్రభుత్వాన్ని దించేది లేదనీ రాష్ట్రపతి పాలన విధించేది లేదనీ కదా కేంద్రం మొండిగా వాదిస్తున్నదీ. వారి ఈ 'భద్రతా సలహాదారుడి' నియమకానికి అర్థం ఏమిటి?

సంఘపరివార్ హంతక మూకలకు గుజ రాత్‌లో తాము చేసిందేమిటో బాగా తెలుసు, దానికి ఉండగల పర్యవసానాలలో బాగానే తెలుసు. ఇండ్లకు తిరిగి పోలేక రిలీఫ్ క్యాంపులలో గుమి గూడిన ముస్లిం కుటుంబాల యువకుల ఆలోచనలు ఏ దిశగా పోగలవో వారికి బాగానే తెలుసు. ముస్లిం అంటేనే తీవ్రవాది అని వారు నమ్ముతారు కాబట్టి ఆ పోకడలను దానికంటే ఎక్కువ ఊహించుకోగలరు కూడా.

నిజానికి ముస్లిం యువత ఆలోచనలు ఆ దిశగా పోవడం ఎవ్వరికీ మంచిది కాదు. అయినప్పటికీ అది జరగదని ఎవ్వరూ హామీ యివ్వలేరు. పైగా బొంబాయి నగరంలో 1993లో జరిగిన బాంబు పేలుళ్ళ వల్లనే శివసేన ముస్లింల జోలికి ఆ తరువాత ఎప్పుడూ రాలేదన్న అభిప్రాయం చాలా బలంగా వుంది. దావూద్ ఇబ్రహీం పట్ల ఎంత మాత్రం సదభిప్రాయం లేనివారు సహితం, గోద్రా ఘటన తరువాత గుజరాత్‌లో ముస్లింలపైన ఊచకోత నిరాటంకంగా సాగుతుండగా బొంబాయిలో శివసేన ఊరకుండి పోవడానికి కారణం ఆనాటి పేలుళ్లేనని నమ్ముతారు.

గుజరాత్‌లో ముస్లింలు ఆ అభిప్రాయానికి సులభంగా రాగలరని కేంద్ర, రాష్ట్ర పాలకులకు తెలుసును కాబట్టే, దానిని మొగ్గలోనే తుంచేయడానికి కెపిఎస్ గిల్‌ను గుజరాత్‌కు పంపించారు. ఒక ఆలోచనకు ఒక నిర్ణయాన్ని 'మొగ్గలో' తుంచేయాలంటే వాటి పట్ల ఆకర్షితులు కాగలవారి ప్రాణాలను చిదిమేయడం ఒక్కటే మార్గమని గిల్ నమ్ముతాడు కాబట్టి అతనివ్వగల 'భద్రతా సలహాలు' ముస్లింలకు ప్రాణాంతకంగా ఉండగలవు.

పైగా ఇదే సమయంలో పోటో కూడా వచ్చింది. పోటోలో 8 ముస్లిం సంస్థలు టెర్రరిస్టు సంస్థలుగా ప్రకటించబడగా ఒక్క హిందూ సంస్థకూ ఆ గుర్తింపు ఇవ్వలేదు గతంలో పంజాబు డిజిపీగా ఉన్నప్పుడు టాడా చట్టాన్ని ఎన్‌కౌంటర్ హత్యలనూ చాలా మెళకువగా కలిపి ప్రయోగించాడన్న పేరు పొందిన గిల్ రేపు గుజరాత్‌లో పోటానీ ఎన్‌కౌంటర్‌లనూ అంతే మెళకువగా కలిపి ప్రయోగించగలడు. ఇప్పటికే నరమేధానికి గురయి తమ గడ్డ మీదనే కాందిశీకులుగా బతుకుతున్న గుజరాతీ ముస్లింలకు ఇంకా గడ్డురోజులు ముందున్నాయి.

ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి. గిల్ బహుశా హిందూ తీవ్రవాదానికీ ముస్లిం తీవ్రవాదానికీ తేడా చూడకపోవచ్చు. రక్తం రుచి మరిగిన పోలీస్ అధికారి కాబట్టి బజరంగ్ దళ్ రక్తం కూడా ఆయనకు రుచిగానే ఉండగలదు. అయితే ఆయన ప్రభుత్వానికి సలహాదారు మాత్రమే. ఆయన ఇచ్చే సలహాలను అమలు చేసేది గుజరాత్ ప్రభుత్వం. ఆయన ఇచ్చే సలహాలను తమ వ్యూహరచనలో ఏ విధంగా ఇముడ్చుకునేదీ నిర్ణయించుకునేది వారు. వారి వ్యూహరచనకున్న ఏకైక లక్ష్యం ఆ రాష్ట్రంలో ముస్లింలు వాళ్ళే ఎన్నడూ తలెత్తకుండా అణచివేయడం.